# పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- ఇంటర్‌కు 36, పది కోసం 60 పరీక్ష కేంద్రాలు
- కలెక్టర్ విజయేందిర బోయి



మట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావు

**జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్):** మార్చిలో జరిగే ఇంటర్, పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ విజయేందిరబోయి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇంటర్, పదో తరగతి పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. మార్చి 5వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలు, మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వరకు పదో తరగతి పరీక్షలు జరుగుతున్నట్లు ఆమె తెలిపారు. ఇంటర్మీడియట్ కోసం 36, పదో తరగతి పరీక్షలకు 60 పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయా శాఖల అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. పరీక్షల సందర్భంగా 144 సెక్షన్ విధించాలని, ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లు ఏర్పాటు చేయాలని, జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని, పరీక్షా కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షల వేళ నిరంతరం విద్యుత్ సరఫరా ఇవ్వాలని, సీసీ కెమెరాల మధ్య పరీక్షలు నిర్వహించనున్నందున కరెంట్ అంతరాయం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ అధికారులు విద్యార్థులను ఎగ్జామ్ సెంటర్లకు చేర్చేందుకు సకాలంలో బస్సులు నడపాలని కోరారు. నెలరోజుల పాటు జరిగే పరీక్షల నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా పరీక్షలను సవ్యంగా నిర్వహించేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ వస్తువులకు, సెల్‌ఫోన్లకు అనుమతి ఉండదని ఆమె స్పష్టం చేశారు. అదనపు ఎస్పీ పి.రాములు, ఆర్డీఓ నవీన్, ఇంటర్మీడియట్ విద్యా శాఖాధికారి కౌసర్‌జహా న్, డీఈఓ ప్రవీణ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

**చివరి ఆయకట్టుకు సాగునీరందించాలి**

చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) శాంతికుమారి అన్నారు. హైదరాబాద్ నుంచి ఆమె వీసీ నిర్వహించారు. కలెక్టర్ విజయేందిర, అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావు పాల్గొన్నారు. రైతులు ఇబ్బందులకు గురికాకుండా సాగునీటి భరోసానివ్వాలని, సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలని సీఎస్ ఆదేశించారు.

**యూడీఐడీలో దరఖాస్తు చేసుకోవాలి**

దివ్యాంగులు సదరం సర్టిఫికేట్లు పొందేందుకు ఇక నుంచి www.swavlambancard.gov.in వెబ్‌సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ విజ యేందిర బోయి తెలిపారు. కలెక్టరేట్‌లోనీ మీటింగ్ హాల్‌లో మీసేవా కేంద్రాల ఆపరేటర్లకు 21 వైక ల్యాలకు సదరం గుర్తింపు పొందడం పై దివ్యాంగుల వివరాలు మీసేవకేంద్రాల్లో నమోదు పై నిర్వహించిన శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ సదరం క్యాంపునకు హాజరయ్యే ముందు దివ్యాంగులు మీసేవా కేంద్రాల్లో UDID వెబ్‌సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## హైస్కూల్‌కు విద్యుత్ పునరుద్ధరణ



హైస్కూల్‌లో విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

**జడ్చర్ల టౌన్:** మున్సిపాలిటీ పరిధిలోని సిగ్నల్ గడ్డపై ఉన్న బాదేపల్లి జెడ్పీ హైస్కూల్‌కు విద్యుత్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. 'హైస్కూల్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేత' అన్న శీర్షికన సోమవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ ఏడీఏ చంద్రశేఖర్ స్పందించారు. హైస్కూల్‌కు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించటంతో పాటు ప్రీపెయిడ్ మీటర్‌ను తొలగించి సాధారణ మీటర్‌ను అమర్చారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

## మున్సిపాలిటీని సాధించుకునేందుకు పోరాడుతాం



వేడుకుంటున్న వార్డు కౌన్సిలర్లు

**జడ్చర్ల టౌన్:** జడ్చర్ల, కావేరమ్మపేట కలిపి మున్సిపాలిటీగా మార్చాలనే తమ మొరవినాలంటూ వార్డుకౌన్సిలర్లు జ్యోతి, కుమ్మరి రాజు, శశికిరణ్, బుక్కమహేష్, చైతన్య చౌహన్ అధికారులు, విన్నవించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అఖిల పక్ష కమిటీ ఏర్పాటుచేసి మున్సిపాలిటీని సాధించుకునేందుకు పోరాడుతామన్నారు. త్వరలోనే స్థానిక ఎమ్మెల్యేను కలిసి ప్రత్యేక మున్సిపాలిటీపై వినతిపత్రం సమర్పిస్తామన్నారు. పార్టీలకతీతంగా సహకరించాలని పిలుపునిచ్చారు. జడ్చర్ల, కావేరమ్మపేటల్లో 9 వార్డులుండగా తామంతా ఏకతాటిపై ఉన్నామని, పార్టీల నాయకులు సైతం తమకు మద్దతుగా ఉన్నారని ప్రకటించారు.

## క్లుప్తంగా

### సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం



**అడ్డాకుల:** మండలంలోని కందూర్ సమీపంలో స్వయంభూగా వెలిసిన శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయం వద్ద సోమవారం సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. రోడ్డు ఆవశ్యకతను ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి దృష్టికి ఇటీవల ఆలయ నిర్వాహకులు తీసుకెళ్లారు. స్పందించిన ఆయన కలెక్టర్‌తో మాట్లాడి నిధులను కేటాయింపజేశారు. సుమారు రూ.45లక్షలను కేటాయించడంతో ఆలయ ఈఓ రాజేశ్వర శర్మ, కాంగ్రెస్ నాయకులతో కలిసి పనులను ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు తోట శ్రీహరి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు కారెడ్డి నాగిరెడ్డి, బుచ్చన్నగౌడ్, రాములు, సత్తిరెడ్డి ఉన్నారు. అడ్డాకుల ఎస్సీ కాలనీలో సీసీ రోడ్ల పనులను కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయమోహన్‌రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు హన్మంతు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు.

### దర్గా తొలగింపుపై విచారణ జరపాలి



**నవాబుపేట:** చాలా ఏళ్లుగా ఉన్న దర్గాను గుట్టుచప్పుడు కాకుండా తొలగించి వేరే చోట ఏర్పాటు చేయడంపై విచారణ జరపాలని యన్మన్‌గండ్ల గ్రామస్తులు తహసీల్దార్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. సర్వే నంబర్ 325లో ఉన్న పురాతన దర్గాను తొలగించి సర్వే నంబర్ 330లో ఏర్పాటు చేశారని వారు ఆరోపించారు. ఈ వ్యవహారం మొత్తం రాత్రికి రాత్రే జరిగిందని, దర్గా తొలగించిన వారిపై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూములను కాపాడాలని గ్రామస్తులు జమీల్, హమీద్, నర్సింహులు, రాజు, కేశవులు తహసిల్దార్‌ను కోరారు. ఈ విషయంలో విచారణ జరుపుతామని తహసీల్దార్ వివరించారు.

### కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి





**మిడ్జిల్:** విద్యార్థినులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రబ్బానీ అన్నారు. సోమవారం స్థానిక కేజీబీవీలో పదో తరగతి విద్యార్థినులకు 9వ తరగతి వారు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తమకు పాఠశాలతో ఉన్న అనుబంధాన్ని వివరించారు. అనంతరం విద్యార్థినులకు ప్రభుత్వం సరఫరా చేసిన దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి కవిత, మాజీ సర్పంచ్‌లు శారదవెంకటయ్య, జ్యోతి అల్వాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు సంపత్, గౌస్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

### విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు



**మహమ్మదాబాద్:** వ్యవసాయ పంటలు సాగు చేసిన రైతులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఏఈ సత్యం తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని కొత్తగా ఏర్పాటుచేస్తున్న 33కేవీ విద్యుత్‌లైన్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీలో వరి సాగుచేసిన రైతులు వ్యవసాయ బోర్లలో నీరు తగ్గి ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, నిరంతరాయంగా బోర్లు నడిపిస్తే విద్యుత్ సమస్య ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఆయన పలు పంట పొలాలను పరిశీలించారు.

### కందూర్‌లో హుండీ లెక్కింపు

**అడ్డాకుల:** మండలంలోని కందూర్ శివారులో స్వయంభూగా వెలిసిన శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం హుండీని లెక్కించారు. 11నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు మొదలు కానున్న నేపథ్యంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వీణాధరి, ఈఓ రాజేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు హుండీని లెక్కించారు. రూ.4.06లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు.

## సైన్స్ ఉపాధ్యాయులకు ఏఐపై అవగాహన



**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** సైన్స్‌ఫోరం ఆధ్వర్యంలో స్థానిక ఏఎస్ఎన్ గార్డెన్స్‌లో సోమవారం సైన్స్ ఉపాధ్యాయులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఏఐపై ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులకు తరగతులు బోధించేందుకు సులువుగా ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీధర్‌రెడ్డి, రాజశేఖర్, కళ్యాణ్‌కల్వ, ఫోరం సభ్యులు పద్మావతి, విజయభాస్కర్, షంషీర్, సాయిబాబ పాల్గొన్నారు.

## విద్యార్థినులకు మెరుగైన విద్య



**చిన్నచింతకుంట:** కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో ప్రభుత్వం విద్యార్థినులకు మెరుగైన విద్యను అందిస్తోందని ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ ఎల్లయ్య అన్నారు. సోమవారం మండలంలో కేజీబీవీలో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈవేడుకలకు ముఖ్యఅతిథులుగా హాజరైన ఎంపీడీఓ, తహసీల్దార్ మాట్లాడారు. ప్రభుత్వం పేద విద్యార్థినులకు ఉన్నత విద్యను అందించేందుకు కేజీబీవీలను ఏర్పాటుచేసిందన్నారు. ఆటలు పాటలు నిర్వహించి వారిలోని నైపుణ్యాని వెలికితీసేందుకు కృషి చేస్తుందని అన్నారు. విద్యార్థినులు నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రత్యేక అధికారి హేమలత, రాజేశ్వరి, లక్ష్మీదేవి, మమత, జ్యోతిలక్ష్మి, హిమబిందు, స్వప్న, మంజుల ఉన్నారు.

## హెల్మెట్ తప్పక ధరించాలి



**చిన్నచింతకుంట:** ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని ఎస్ఐ రామ్‌లాల్ నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని అల్లిపురం గ్రామ సమీపంలో ఆత్మకూర్, దేవరకద్ర రోడ్డుపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు మద్యం సేవించరాదని సూచించారు. ప్రభుత్వ నిబంధనలను పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**మహమ్మదాబాద్:** అనుమతుల్లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. హన్వాడ మండలం కిష్టంపల్లి నుంచి జూలపల్లికి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న సమాచారంతో పోలీసులు ఆదివారం రాత్రి ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

## 18న నాయీబ్రాహ్మణ సేవాసంఘం ఎన్నికలు

**జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్):** నాయీబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా కమిటీఎన్నికలు ఈ నెల 18వ తేదీన స్థానిక ఆ సంఘం కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు సత్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు హాజరుకావాలని ఆయన కోరారు.

## శ్మశానవాటిక స్థలాన్ని పరిరక్షించాలి

- కలెక్టర్‌ను కలిసిన పాతపాలమూర్ వాసులు
- దివ్యాంగులను డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని వినతి



కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చిన దివ్యాంగులు

**జెడ్పీసెంటర్( మహబూబ్ నగర్):** పాత పాలమూర్‌లోని సర్వే నంబర్ 439లో మాల గుట్టలో ఉన్న శ్మశాన వాటిక స్థలం అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని పాత పాలమూర్ వాసులు వెంకటయ్య, యాదయ్య, నాగయ్య కోరారు. సోమవారం కలెక్టర్ విజయేందిరబోయిని కలిసి వినతిప్రతం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 35 ఎకరాలు ఉన్న ఈస్థలంలో ఇప్పటికే ఏడెకరాలు కబ్జాకు గురైందని, మిగతా భూమి కబ్జాకు గురి కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. శ్మశానవాటిక చుట్టూ ప్రహరీని నిర్మించి తాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, రవిప్రకాష్ పాల్గొన్నారు.

**దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి**

దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఉదయ్ అసోసియేషన్ సభ్యుడు శ్రీనివాసులు అన్నారు. కలెక్టర్ విజయేందిరకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని మౌలాలిగుట్టలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను దివ్యాంగులకు కేటాయించాలన్నారు. తమకు ప్రభుత్వ అధికారులు నోటీసులిచ్చారని ఈవిషయంపై దృష్టి సారించాలని అన్నారు. అంజయ్య, యాదయ్య, శంకర్, ఎర్రన్న, నాగరాజు, వెంకటయ్య, రాధ పాల్గొన్నారు.

## వీరన్నచెరువుకు వచ్చే నీటిని మళ్లించాలి

**భూత్పూర్:** మండలంలోని తాటికొండ వీరన్నచెరువుకు వచ్చే నీటిని మళ్లించాలని హస్నాపూర్ గ్రామస్తులు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ హస్నాపూర్‌కు చెందిన దాదాపు 100 ఎకరాల భూమి గ్రామ శివారు సమీపంలో ఉంది. వీరన్నచెరువుకు జిల్లా కేంద్రంలో పలు కాలనీల నుంచి మురుగు నీరు వచ్చి చేరుతోంది. దీంతో చెరువుకు సమీపంలో హస్నాపూర్ రైతుల పొలాలు నీట మునిగి వ్యవసాయ చేయుటకు వీలులేకుండా పోయింది. దీంతో తాము జీవనోపాధి కోల్పోతున్నామన్నారు. మురుగునీరు చెరువులోకి రాకుండా చేయాలని, లేదంటే ప్రభుత్వం తమకు వేరేచోట పొలాలు ఇవ్వాలని కోరారు. రైతులు మణెమ్మ, కొండయ్య, నర్సింహులు, ఆంజనేయులు, మన్నెమయ్య, బాలయ్య, లలితమ్మ, వెంకటమ్మ, రాజు, వెంకటయ్య పాల్గొన్నారు.

## మొదటి బ్యాచ్‌కు ఫైనల్ పరీక్షలు

- 'నవరత్నాలు'కు హాజరైన 224 మంది మహిళలు
- తనిఖీ చేసిన సెట్విన్ ఎండీ వేణుగోపాల్‌రావు



పరీక్షలను తనిఖీ చేస్తున్న సెట్విన్ హైదరాబాద్ ఎండీ వేణుగోపాల్‌రావు

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** స్థానిక బీకేరెడ్డి కాలనీలోని 'మహబూబ్ నగర్ ఫస్ట్ నవరత్నాలు' శిక్షణ కేంద్రంలో మూడు నెలల పాటు కంప్యూటర్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న మొదటి బ్యాచ్ 224 మంది మహిళలకు సోమవారం సెట్విన్ ఆధ్వర్యంలో ఫైనల్ పరీక్షలు నిర్వహించారు. వీటిని సంస్థ హైదరాబాద్ ఎండీ కె.వేణుగోపాల్‌రావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. అనంతరం బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించేందుకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారన్నారు. వచ్చే బ్యాచ్‌లో ఈ మూడు కోర్సులతో పాటు మగ్గం వర్క్‌పైనా శిక్షణ తరగతులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ శ్రీనివాసులు, సెట్విన్ మహబూబ్‌నగర్ ఇన్‌చార్జ్ విజయ్ కుమార్, మహబూబ్‌నగర్ ఫస్ట్ నవరత్నాలు పర్యవేక్షకులు గుండా మనోహర్, కేంద్రం ఇన్‌చార్జ్ నిజలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

## వినికిడి లోపాన్ని నిర్లక్ష్యం చేయరాదు

- జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.సంపత్‌కుమార్ సింగ్





వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.సంపత్‌కుమార్ సింగ్

**పాలమూరు:** చిన్నారుల నుంచి పెద్దల వరకు ఎవరికైనా వినికిడి సమస్య ఉంటే నిర్లక్ష్యం చేయరాదని జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.సంపత్‌కుమార్ సింగ్ అన్నారు. ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని ఏనుగొండ పంచాయతీ కార్యాలయంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈఎన్‌టీ వైద్యబృందం 85మంది పెద్దలకు, 50మంది చిన్నారులకు వినికిడి పరీక్షలు నిర్వహించారు. దీంట్లో 15మందికి వైద్యచికిత్స అవసరమవుతుందని గుర్తించి వారిని జనరల్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. మరో ఐదుగురికి ఇయరింగ్ అవసరం అవుతుందని గుర్తించారు. కార్యక్రమంలో వైద్యులు చంద్రశేఖర్, శ్రీకాంత్, వైష్ణవి, రమేష్, ఆడియోమెట్రి టెక్నీషియన్ సతీష్ పాల్గొన్నారు.

## శ్రీపాదరావు సేవలు మరువలేనివి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న, వీసీ శ్రీనివాస్

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు సేవలు మరువలేనివని పీయూ వీసీ శ్రీనివాస్ అన్నారు. సోమవారం పీయూలో ఆయన 88వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రాజకీయాల్లో తనదైన ముద్రవేసి, మచ్చలేని నాయకుడిగా పేదల అభ్యున్నతి కోసం కృషి చేశారన్నారు. నేటి తరం యువతకు ఆదర్శం అన్నారు. రిజిస్ట్రార్ చెన్నప్ప, విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**వాల్‌పోస్టర్ ఆవిష్కరణ**

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** పీయూలో ఆలిండియా ఓబీసీ యూత్ లీడర్‌షిప్ సమ్మిట్–2025 వాల్‌పోస్టర్లను వీసీ జి.ఎన్.శ్రీనివాస్ ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ ప్రొ.చెన్నప్ప, సెంట్రల్ యూనివర్సిటీ ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ రింగ్ అధ్యక్షుడు కిరణ్‌గౌడ్, పీయూ విద్యార్థి సంఘం నాయకుడు గడ్డంభరత్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.వంగర భూమయ్య, డా.బి.రవీందర్‌గౌడ్, డా.రాంమోహన్, జి.రాంమోహన్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు

**నవాబుపేట:** మండలంలోని దేపల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. సోమవారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పద్మయ్య, భాస్కర్, వెంకటేష్, శ్రీను హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, దామోదర్ తదితరులున్నారు.

### నేడు వాహనాల వేలం

**జడ్చర్ల:** ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుపడిన వాహనాలను మంగళవారం ఉదయం 11గంటలకు స్టేషన్ ఆవరణలో వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ విప్లవరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ.5వేలు డిపాజిట్ కట్టి తమపేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వాహనం దక్కనివారికి డిపాజిట్ వెనక్కి ఇవ్వబడునని పేర్కొన్నారు.

### హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

**జడ్చర్ల టౌన్:** మున్సిపాలిటీ పరిధిలోని హరిజనవాడ జెడ్పీ హైస్కూల్‌లో కంప్యూటర్ సామగ్రి స్క్రాప్‌కు తరలింపుపై హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలంటూ ఆర్‌జేడీ, డీఈఓలకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఎఫ్ఐ నాయకుడు భరత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల ఆవరణలో చెట్లు నరకటంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు.

### విద్యార్థుల గణిత సామర్థ్యాల పరిశీలన

**జడ్చర్ల టౌన్:** మండలంలోని నెక్కొండ యూపీఎస్ పాఠశాలను సోమవారం ఎంఈఓ మంజులాదేవి తనిఖీచేశారు. పాఠశాలలో 6వ తరగతి విద్యార్థుల గణిత సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం, ఎఫ్ఎల్ఎన్, సీసీఈ పనుల నిర్వహణలపై ఆరాతీశారు. అపార్ ఐడీ జనరేషన్ త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. హెచ్‌ఎం అమూల్య, ఉపాధ్యాయురాలు చంద్రలేఖ ఉన్నారు.

## తాగునీటి సమస్యపై దృష్టి పెట్టండి



**నవాబుపేట:** గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా దృష్టి పెట్టాలని జిల్లా కోఆపరేటివ్ అధికారి, మండల ప్రత్యేకాధికారి శంకరాచారి అన్నారు. సోమవారం మండలం కేంద్రంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో తాగునీటి సమస్యపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలలోనే సమస్యలను పరిష్కరించేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి వాటిని పరిష్కరించామని ఆయన తెలిపారు. సంబంధిత అధికారులతో సంప్రదింపులు జరుపుతూ నిరంతరం పర్యవేక్షించి సమస్యలు రాకుండా చూడాలన్నారు. ఏదైనా సమస్య వస్తే వెంటనే జిల్లా అధికారులకు సమాచారమివ్వాలని సూచించారు. ఎంపీడీఓ జయరాంనాయక్, బద్రునాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి సమీయుల్లా, ఏపీఓ జ్యోతి ఉన్నారు.

## లక్ష్మారెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



**జడ్చర్ల టౌన్:** తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో భాగంగా అప్పట్లో ఎమ్మెల్యే పదవికి డా.లక్ష్మారెడ్డి రాజీనామా చేసిన రోజు సందర్భంగా పాతబజార్ చౌరస్తాలో సోమవారం ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య మాట్లాడుతూ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఎమ్మెల్యే పదవిని తృణప్రాయంగా భావించి రాజీనామా చేసి చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. తొలి రాజీనామా చేయటంతో ఉద్యమం తీవ్రరూపం దాల్చి ఆ తరువాత రాష్ట్ర సాధనకు దారి తీసిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రఘుపతిరెడ్డి, నాయకులు పిట్టలమురళి, బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ఘనంగా మైసమ్మ జాతర ప్రారంభం



**నవాబుపేట:** పర్వతాపూర్ మైసమ్మ దేవాలయం జాతర సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. మొదట ధ్వజారోహణం చేయగా గణపతి పూజ, సామూహిక కలశ పూజా కార్యక్రమాలు కొనసాగాయి. మంగళవారం ప్రత్యేక కుంకుమార్చన, మహా మంగళహారతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు దేవాలయ అధికారి నర్సింహులు తెలిపారు. దేవాలయ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు మల్లేష్, గోపాల్ తదితరులున్నారు.

## విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



మహబూబ్‌నగర్ మణికొండలో స్వయం పాలన దినోత్సవంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

**గండేడ్:** విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు బోధించారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఘనంగా స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్‌ఎంగా వైష్ణవి, ఎంఈఓగా ఐశ్వర్య, కలెక్టర్‌గా కావ్య, విద్యాశాఖ మంత్రిగా సంగీత వ్యవహరించారు. హెచ్‌ఎం జనార్దన్ బహుమతులు అందుకున్నారు.

**ఘనంగా స్వయం పాలన దినోత్సవం**

**మహబూబ్‌నగర్ రూరల్:** మండలంలోని మణికొండ గ్రామ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. కలెక్టర్‌గా పల్లవి, ఆర్‌జేడీగా జనని, డీఈఓగా స్నేహలత, ఎంఈఓగా కీర్తన, హెచ్‌ఎంగా రికిత వ్యవహరించారు. హెచ్‌ఎం కె.రవికుమార్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, నర్సప్ప, అన్వరుద్దీన్, కల్యాణి, శ్రీరాములు, మధుసూదన్, జగదీష్‌గౌడ్, వెంకటయ్య, వెంకటేష్, మల్లేష్, హన్మంతు, అక్తర్ హుస్సేన్, గోపికృష్ణ, శ్రీరాములు, శైలజ పాల్గొన్నారు.